సీఎం సీటుకు ఎసరు?!

- స్కామ్‌లు, విచారణలతో సిద్ధరామయ్య ఉక్కిరిబిక్కిరి
- మెజార్టీ ఎమ్మెల్యేల మద్దతు ఉన్నా సీఎం పదవిపై విరక్తి
- ఈ వయసులో టెన్షన్ అవసరమా అంటూ ఆక్రోశం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

బెంగళూరు, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): ముడా కుంభకోణంలో విచారణను ఎదుర్కోనుండటం ఒకవైపు, వాల్మీకి కార్పొరేషన్ స్కామ్‌లో ఈడీ అరెస్టులు మరోవైపు, రాష్ట్ర వక్ఫ్‌బోర్డులో అవినీతి మరకలు ఇంకోవైపు.. వెరసి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పదవికే ముప్పు తెస్తున్నాయి. వీటితో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఆయన మెజారిటీ ఎమ్మెల్యేల మద్దతు ఉన్నప్పటికీ సీఎం పదవి నుంచి దిగిపోవడానికి సిద్ధమైనట్టు సమాచారం. ఇదే విషయమై అధిష్ఠానం బుజ్జగింపులకు ప్రయత్నించినా.. ఆయన తిరస్కరిస్తున్నట్టు తెలుస్తున్నది. 76 ఏండ్ల వయసులో ఈ రాజకీయ ఒత్తిళ్లు, విచారణలు అవసరమా? అని సన్నిహితుల వద్ద సిద్ధరామయ్య వాపోయినట్టు విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. దీంతో త్వరలోనే ఆయన సీఎం పదవికి రాజీనామా చేయవచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

రేసులో ఎవరు?

నిరుడు కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే డీకే శివకుమార్ సీఎం అవుతారని అందరూ భావించారు. అయితే, అనూహ్యంగా అధిష్ఠానం సిద్ధరామయ్యకు ఆ పదవిని కట్టబెట్టింది. అయితే, తమ నాయకుడికి సీఎం పదవిని ఇవ్వకపోవడంపై డీకే వర్గం ఎమ్మెల్యేలు గుర్రుగా ఉన్నారు. అయితే, మెజారిటీ ఎమ్మెల్యేల మద్దతు సిద్ధరామయ్యకు ఉండటంతో ఇంతకాలం ముఖ్యమంత్రి మార్పు జరుగలేదు. ఇదే సమయంలో డీకేకు ఉప ముఖ్యమంత్రి పదవిని అధిష్ఠానం కేటాయించింది. కాగా, సిద్ధరామయ్య సీఎం పదవి నుంచి దిగిపోతే ఎవరు ఆ రేసులో ఉంటారన్న చర్చ ప్రస్తుతం జరుగుతున్నది. హోంమంత్రి జీ పరమేశ్వరకు సీఎం పదవి ఇవ్వొచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. డీకేపై అప్పట్లో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తడంతో అధిష్ఠానం పరమేశ్వర వైపు మొగ్గు చూపవచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

వందేండ్లకైనా వచ్చేనా?

గ్రీన్‌కార్డు కోసం అమెరికాలో 3.47 కోట్ల మంది నిరీక్షణ

వాషింగ్టన్, ఆగస్టు 17: అమెరికాలో శాశ్వత నివాస హోదా కల్పించే 'గ్రీన్ కార్డ్'ను పొందేందుకు ప్రవాస భారతీయులు నానా కష్టాలు పడుతున్నారు. గ్రీన్ కార్డు వెయిటింగ్ టైమ్..100 ఏండ్లకు చేరుకుందన్న కామెంట్స్ సోషల్ మీడియాలో వెల్లువెత్తుతున్నాయి. దరఖాస్తుల సంఖ్య 3.47 కోట్లకు చేరుకోగా, 2024 ఆర్థిక సంవత్సరంలో 11 లక్షల మందికి గ్రీన్ కార్డులు వచ్చే అవకాశముందని అంచనా! ఈ నేపథ్యంలో ఉన్నత చదువులు, ఉద్యోగాల కోసం అమెరికాకు రావొద్దంటూ నెటిజన్లు సలహాలు ఇస్తున్నారు. ప్రస్తుతం భారత్‌లోని వివిధ నగరాల్లో 'ఎడ్యుకేషన్ యూఎస్ఏ ఫెయిర్స్' నిర్వహిస్తున్నారు. వీటిలో పాల్గొనాల్సిందిగా భారత్‌లో అమెరికా అంబాసిడర్ ఎరిక్ గార్సెట్టీ చేసిన ప్రకటనపై నెటిజన్లు మండిపడుతున్నారు. వర్సిటీ ప్రతినిధులు చెప్పే మాటలన్నీ అబద్ధాలేనని, మోసపోవద్దని మనవాళ్లను హెచ్చరిస్తూ సోషల్ మీడియాలో సందేశాలు వెలువడుతున్నాయి.

ఏమిటీ గ్రీన్ కార్డ్?

ఆ దేశంలోనే శాశ్వతంగా బతకాలనుకుంటే 'గ్రీన్ కార్డు' పొందాల్సిందే. లేదంటే హెచ్1-బీ వీసా రెన్యూవల్ చేసుకుంటూ పోవాలి. కుదరకపోతే స్వదేశానికి వెళ్లిపోవాలి. ఎన్ని గ్రీన్ కార్డులు మంజూరు చేయాలన్నది అమెరికా చట్టసభ నిర్ణయిస్తుంది. ఎంప్లాయ్‌మెంట్ బేస్డ్ కార్డులు 1,40,000 మాత్రమే ఉన్నాయి. టెక్నాలజీ, మెడిసిన్, అకడమిక్స్‌లో పనిచేస్తున్న 12 లక్షల మందికిపైగా ప్రవాస భారతీయులు కొన్ని దశాబ్దాలుగా 'గ్రీన్ కార్డు' కోసం ఎదురుచూస్తున్నారు.

'ముడా' చిక్కుల్లో సిద్ధరామయ్య

- కర్ణాటక సీఎంను విచారించేందుకు అనుమతినిచ్చిన గవర్నర్
- సిద్ధరామయ్య భార్యకు విలాస ప్రాంతాల్లో స్థలాలు
- తెర వెనుక చక్రం తిప్పిన కుమారుడు ఎమ్మెల్సీ యతీంద్ర
- బీజేపీ సహా హక్కుల కార్యకర్తల సంచలన ఆరోపణలు
- 'ముడా'లో రూ. 4 వేల కోట్ల మేర స్కామ్ అంటూ ఫైర్
- సిద్ధరామయ్య రాజీనామా చేయాలని విపక్షాల డిమాండ్
- రాజీనామా చేసేంత తప్పు తానేం చేయలేదన్న కర్ణాటక సీఎం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

బెంగళూరు, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): వేల కోట్ల రూపాయల అక్రమాలు చోటుచేసుకున్న మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) కుంభకోణంలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య అడ్డంగా బుక్కయ్యారు! ఈ స్కామ్‌కు సంబంధించి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విచారణను ఎదుర్కోనున్నారు. దీంతో అధికార కాంగ్రెస్ ఉక్కిరిబిక్కిరి అవుతున్నది. ఈ కుంభకోణానికి సంబంధించి సిద్ధరామయ్యపై విచారణకు రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ శనివారం అనుమతిచ్చారు. దీనికి సంబంధించిన సమాచారం అందినట్టు సీఎం కార్యాలయం కూడా నిర్ధారించింది. దీంతో సిద్ధరామయ్యకు రాజకీయంగా ఇబ్బందికర పరిస్థితులు ఎదురవ్వొచ్చని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

గవర్నర్ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధం: సిద్ధరామయ్య

తనపై విచారణకు గవర్నర్ అనుమతినివ్వడంపై సీఎం సిద్ధరామయ్య స్పందించారు. గవర్నర్ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని, చట్టవ్యతిరేకమని ఆక్షేపించారు. ప్రజాస్వామ్యయుతంగా ఏర్పడ్డ ప్రభుత్వాన్ని కూలదోసేందుకే బీజేపీ, జేడీఎస్ కుట్ర చేస్తున్నాయని మండిపడ్డారు. తాను రాజీనామా చేసేంత తప్పేమీ చేయలేదన్నారు. ఈ విషయంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. ముడా కుంభకోణం ఆరోపణలను గతంలోనూ సిద్ధరామయ్య ఖండించారు. తమ కుటుంబానికి ఎవరు, ఎలా ఆ భూములను కేటాయించారో తనకు తెలియదని పేర్కొన్నారు. బీజేపీ హయాంలోనే ఈ కేటాయింపులు జరిగినట్టు చెప్పుకొచ్చారు. రింగ్ రోడ్డుకు సమీపంలో తన భార్య పేరిట 3.16 ఎకరాల భూమి ఉన్నమాట వాస్తవమేనని పేర్కొన్నారు. భూముల కేటాయింపుల్లో 50:50 ఫార్ములాను బీజేపీనే ప్రతిపాదించిందని పేర్కొన్నారు.

గవర్నర్‌ది సరైన నిర్ణయమే: ప్రహ్లాద్ జోషీ

సీఎం సిద్ధరామయ్యను విచారించేందుకు గవర్నర్ అనుమతి ఇవ్వడాన్ని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ సమర్థించారు. ఈ కుంభకోణంపై విచారణకు ఆదేశించి గవర్నర్ సరైన నిర్ణయం తీసుకున్నారని ఆయన మీడియా సమావేశంలో పేర్కొన్నారు. లోకాయుక్త లేదా స్థానిక అధికార యంత్రాంగం దీనిపై విచారణ జరుపుతుందని, దీనికి సిద్ధరామయ్య సహకరించాలని కోరారు. తనపై వచ్చిన ఆరోపణలకు నైతిక బాధ్యత వహిస్తూ సిద్ధరామయ్య రాజీనామా చేయాలంటూ బీజేపీ ఎంపీ, మాజీ సీఎం జగదీశ్ షెట్టర్, కేంద్ర సహాయ మంత్రి శోభా కరంద్లాజే డిమాండ్ చేశారు. విపక్ష జేడీ(ఎస్) కూడా సీఎం రాజీనామా చేయాలని కోరింది.

ఇది రాజకీయ ప్రేరేపితం

సీఎం సిద్ధరామయ్యపై విచారణకు గవర్నర్ ఆదేశించడాన్ని కర్ణాటక మంత్రివర్గం ఖండించింది. గెహ్లోట్ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధం, రాజకీయ ప్రేరేపితమైనదని ఆరోపించింది. దీనిపై తాము న్యాయపోరాటం చేస్తామని తెలిపింది. పార్టీ కార్యకర్తలు మైసూరు, మండ్య, బెంగళూరులతో పాటు పలు ప్రాంతాల్లో నిరసనలు తెలిపారు. గవర్నర్‌ను వెంటనే తొలగించాలంటూ బెంగళూరులోని గాంధీనగర్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు, కర్ణాటక ప్రదేశ్ కురుబుర సంఘ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన జరిపారు. అనంతరం గవర్నర్ గెహ్లోట్ దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. మాండ్య, దావణగెరెలలో సైతం సిద్ధరామయ్యకు అనుకూలంగా ప్రదర్శనలు నిర్వహించారు.

ఏమిటీ స్కాం?

బీజేపీ నేతలు, హక్కుల కార్యకర్తల ఆరోపణల ప్రకారం.. మైసూరు శివారులోని కెసరె గ్రామంలో సిద్ధరామయ్య భార్య పార్వతమ్మకు 3 ఎకరాల 16 గుంటల భూమి ఉంది. అయితే, అవసరాల దృష్ట్యా ఆ భూమిని సేకరించిన ప్రభుత్వం.. దానికి బదులుగా నగరం లోపల అత్యంత ఖరీదైన ప్రాంతాలుగా చెప్పుకొనే విజయనగర్, దట్టగల్లీ, జేపీ నగర్, ఆర్టీ నగర్, హంచయా-సతాగల్లీలో సిద్ధరామయ్య కుటుంబానికి 38,283 చదరపు అడుగుల భూమిని కేటాయించింది. 50:50 నిష్పత్తిలో (పడావు పడ్డ ఒక ఎకరా తీసుకొంటే, అభివృద్ధి చేసిన అర్ధ ఎకరం ఇవ్వడం) ఈ కేటాయింపు జరిగింది. అయితే, కెసరెలోని భూములతో పోలిస్తే మార్కెట్ ధర అతి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సిద్ధరామయ్య కుటుంబానికి ఆ భూములను కేటాయించాలని ఎవరు సిఫారసు చేశారని బీజేపీ నేత ఆర్ అశోక్ నిలదీశారు. క్యాబినెట్ అనుమతి లేకుండా భూములు కేటాయించే అధికారం ఎవరికి ఉంటుందని, ముఖ్యమంత్రికి తెలియకుండానే రూ. 4 వేల కోట్ల విలువజేసే ఇంత పెద్ద కుంభకోణం జరిగిందా? అని ఆయన ప్రశ్నించారు. ముడా భూకుంభకోణంలో సిద్ధరామయ్య కొడుకు యతీంద్ర పాత్ర ఉన్నదని, ఆయనే దీనికి అసలు సూత్రధారని బీజేపీ ఎమ్మెల్సీ హెచ్ విశ్వనాథ్ ఆరోపించారు. ఈ స్కామ్ మూలంగా వేల కోట్లు పక్కదారి పట్టాయని ముగ్గురు హక్కుల కార్యకర్తలు ప్రదీప్ కుమార్, టీజే అబ్రహం, స్నేహమయి కృష్ణ.. లోకాయుక్త పోలీసులు సహా గవర్నర్ కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే గవర్నర్ సీఎంపై విచారణకు అనుమతినిచ్చారు.

పిల్లల పెంపకానికి 'ప్రొఫెషనల్ పేరెంట్స్'

- చైనా సంపన్నుల్లో కొత్త పోకడ

బీజింగ్: చైనాలోని సంపన్నుల్లో కొత్త పోకడ పుట్టుకొచ్చింది. కెరీర్‌లో ఎదుగుదలపై దృష్టి పెట్టే సంపన్నులైన తల్లిదండ్రులు తమ పిల్లల పెంపకం బాధ్యతలను 'ప్రొఫెషనల్ పేరెంట్స్'కు అప్పగిస్తున్నారు. తల్లిదండ్రులుగా తాము చేయాల్సిన పనులను ఈ నిపుణుల చేత చేయిస్తున్నారు. సైకాలజీలో పీహెచ్‌డీ చేస్తున్న విద్యార్థి ఒకరు వందలాది మంది ప్రొఫెషనల్ పిల్లల పెంపకందారులను ఇంటర్వ్యూ చేసి ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేస్తున్నవారిలో అత్యధికులు హార్వర్డ్, కేంబ్రిడ్జ్, త్సింఘువా, పెకింగ్ వంటి ప్రముఖ విశ్వవిద్యాలయాల నుంచి డిగ్రీలు పొందినవారేనని చెప్పారు. వీరిలో కొందరు బాలల మానసిక శాస్త్రంలో ప్రత్యేక నైపుణ్యం సాధించినవారని, మరి కొందరు మాస్టర్స్ డిగ్రీ, అంతకన్నా ఎక్కువ విద్యార్హతలు కలవారని తెలిపారు. ప్రొఫెషనల్ చైల్డ్ కంపేనియన్‌గా నియమితులైనవారు తమ యజమాని పిల్లలను బడికి తీసుకెళ్లడం, అవసరమైనపుడు దవాఖానకు తీసుకెళ్లడం, హోమ్‌వర్క్ చేయించడం, ఆడించడం వంటి పనులు చేస్తారు. వీరికి నెలకు జీతం రూ.1,17,000 నుంచి రూ.3,43,000 వరకు ఉంటుంది. 'ప్రొఫెషనల్ అమ్మ'లకు డిమాండ్ బాగా ఉంది. ప్రొఫెషనల్ నాన్నలకు డిమాండ్ తక్కువగా ఉంది. మగ పిల్లల కోసమే ప్రొఫెషనల్ నాన్నలను నియమించుకుంటున్నారు.

బండరాయిని ఢీకొన్న సబర్మతి ఎక్స్‌ప్రెస్

పట్టాలు తప్పిన 22 బోగీలు

కాన్పూర్: ఉత్తరప్రదేశ్‌లో సబర్మతి ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. శనివారం తెల్లవారుజామున 2:30 గంటలకు కాన్పూర్ - భీమ్‌సేన్ రైల్వే స్టేషన్ల మధ్య 22 బోగీలు పట్టాలు తప్పి పక్కకు జరిగాయి. రైలు వారణాసి నుంచి అహ్మదాబాద్ వెళుతుండగా ఈ దుర్ఘటన జరిగింది. అదృష్టవశాత్తూ ఎవరికీ గాయాలు కాలేదు. ప్రమాదం కారణంగా ఏడు రైళ్లు రద్దు కాగా, మూడు రైళ్లను దారి మళ్లించారు. పట్టాలపై ఉన్న భారీ బండరాయిని రైలు ఇంజిన్ ముందు భాగం(కాటిల్ గార్డ్) ఢీకొనడంతో ఘటన జరిగిందని రైల్వే అధికారులు తెలిపారు. కాటిల్ గార్డ్ దెబ్బతిన్నదని చెప్పారు. ఈ ఘటనపై విచారణ జరుపుతున్నట్టు రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.

9 ఏండ్లలో మూడోసారి కూలిన వంతెన

పాట్నా, ఆగస్టు 17: బీహార్‌లో వంతెనలు కూలిపోతున్న సంఘటనలు ఆగటం లేదు. తాజాగా సుల్తాన్ గంజ్-అగువాని ఘాట్ వంతెనపై నిర్మిస్తున్న నిర్మాణంలోని కొంత భాగం కూలిపోయి, గంగా నదిలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో ఎవరూ గాయపడలేదు. ఈ వంతెన తొమ్మిదేండ్ల నుంచి నిర్మాణంలో ఉంది. దీనిలోని చాలా భాగాలు ఇప్పటికే రెండుసార్లు కూలిపోయాయి. దీనిని నిర్మిస్తున్న ఎస్‌కే సింగ్లా కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఈ సంఘటనపై స్పందించలేదు. ఈ వంతెన చాలా ముఖ్యమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టు అని ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ చెప్తూ ఉంటారు. దీని నిర్మాణం పూర్తయితే భాగల్పూర్ నుంచి ఖగారియా గుండా జార్ఖండ్‌కు ప్రయాణించడం సులువవుతుంది.

అమెరికాలో కాల్పులు.. భారత సంతతి వ్యక్తి మృతి

వాషింగ్టన్, ఆగస్టు 17: అమెరికాలో దోపిడీ, తుపాకీ కాల్పుల ఘటనలకు భారత సంతతి పౌరులు బలవుతున్నారు. ఉత్తర కరోలినాలో ఓ టొబాకో స్టోర్‌ను నడుపుతున్న మైనాక్ పటేల్ (36)పై దొంగతనానికి వచ్చిన దుండగుడు విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డాడు. కాల్పుల్లో మైనాక్ పటేల్ చనిపోయాడని పోలీసులు వెల్లడించారు. మైనాక్ పటేల్‌కు భార్య, 5 ఏండ్ల కూతురు ఉన్నారు. వందలాది మంది స్థానికులు టొబాకో స్టోర్ వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి అతడి మృతికి నివాళి అర్పించారు. కాల్పుల ఘటనలో నిందితుడైన బాలుడిని అదుపులోకి తీసుకున్నామని రోవాన్ కౌంటీ షెరీఫ్ తెలిపారు. దుండగుడు చోరీ కోసం వచ్చి ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు.

లక్నో ఎయిర్‌పోర్ట్‌లో రేడియో ధార్మిక పదార్థం

క్యాన్సర్ మందుల్లోంచి లీకైన ఫ్లోరైన్

న్యూఢిల్లీ: లక్నోలోని చౌదరి చరణ్ సింగ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రేడియో ధార్మిక పదార్థం కలకలం రేపింది. శనివారం మధ్యాహ్నం టెర్మినల్ 3లోని కార్గో ప్రాంతంలో పార్సిళ్లను తనిఖీ చేస్తున్న సమయంలో రేడియో ధార్మిక పదార్థాన్ని గుర్తించిన అలారం ఒక్కసారిగా మోగింది. దీంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఓ క్యాన్సర్ రోగికి సంబంధించిన మందులను స్కాన్ చేస్తున్న సమయంలో అందులోని ఫ్లోరైన్ లీకైంది. ఇది రేడియో ధార్మిక పదార్థం కావడంతో అలారం ఒక్కసారిగా మోగి గందరగోళం తలెత్తింది.

ఉదయ్‌పూర్‌లో ఉద్రిక్తతలు

మొబైల్ ఇంటర్నెట్ సేవల నిలిపివేత

జైపూర్: రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని సహ విద్యార్థి శుక్రవారం కత్తితో దారుణంగా పొడిచాడు. గాయపడిన విద్యార్థిని దవాఖానకు తరలించి, చికిత్స చేయిస్తున్నారు. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి ఇంటిని బుల్డోజర్‌తో కూల్చేశారు. ఈ సంఘటన గురించి బయటకు పొక్కడంతో మతపరమైన ఉద్రిక్తతలు చెలరేగాయి. హిందూ సంస్థలు నిరసన ప్రదర్శనలు చేశాయి. ఉదయ్‌పూర్ జిల్లా కలెక్టర్ అరవింద్ పోస్వాల్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను తదుపరి ఆదేశాలు వెలువడే వరకు మూసివేయాలని ఆదేశించినట్లు తెలిపారు. సీఎం భజన్‌లాల్ శర్మ ఆదేశాల మేరకు, గాయపడిన విద్యార్థికి చికిత్స చేసేందుకు ముగ్గురు వైద్యుల బృందం జైపూర్ నుంచి ఉదయ్‌పూర్ చేరుకుందని తెలిపారు. పలు ప్రాంతాల్లో మొబైల్ ఇంటర్నెట్ సేవలను శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి 24 గంటలపాటు నిలిపేయాలని డివిజినల్ కమిషనర్ రాజేంద్ర భట్ ఆదేశించారు.

స్తంభించిన వైద్య సేవలు

- కోల్‌కతా ఘటనకు నిరసనగా అన్ని రాష్ట్రాల్లో డాక్టర్ల ఆందోళనలు
- యూకే, బంగ్లాదేశ్‌ల్లోనూ ప్రదర్శనలు
- కేంద్రం ముందు ఐదు డిమాండ్లు
- కమిటీ వేస్తామన్న ప్రభుత్వం

ఢిల్లీలో వైద్యుల నిరసన

న్యూఢిల్లీ/కోల్‌కతా, ఆగస్టు 17: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై లైంగిక దాడి, హత్య ఘటనపై దేశవ్యాప్తంగా వైద్యులు, వైద్యసిబ్బంది ఆందోళనకు దిగారు. శనివారం 24 గంటల సమ్మె నిర్వహించారు. దీంతో వైద్యసేవలు స్తంభించిపోయాయి. అన్ని రాష్ట్రాల్లోనూ వైద్యులు, వైద్య విద్యార్థులు, సిబ్బంది విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. వైద్యుల సమ్మెతో అనేక దవాఖానాల్లో ఓపీ, డిస్పెన్సరీ వంటి వైద్యసేవలు నిలిచిపోయాయి. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఐసీయూ, ఎమర్జెన్సీ విభాగం, ఆపరేషన్ థియేటర్ల కార్యకలాపాలను మాత్రం వైద్యులు కొనసాగించారు. కోల్‌కతా ఘటనను సుమోటోగా తీసుకొని విచారణ జరపాలని కోరుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు మూడు లేఖలు అందాయి. కాగా, గుజరాత్‌లోని అమ్రేలీలో వైద్యుల నిరసన కార్యక్రమంలో తన లైసెన్స్‌ను తుపాకీని ప్రదర్శించారనే ఆరోపణలతో జీజే జజీరా అనే వైద్యుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

యూకే, బంగ్లాలోనూ నిరసనలు

కోల్‌కతా ఘటనకు వ్యతిరేకంగా విదేశాల్లోనూ నిరసనలు జరిగాయి. యూకేలో భారతీయ వైద్యులు, వైద్య విద్యార్థులు లండన్‌లోని ఇండియా హౌస్ ముందు శాంతియుత నిరసన తెలిపారు. బంగ్లాదేశ్‌లోని ఢాకా విశ్వవిద్యాలయంలో విద్యార్థులు నిరసన తెలిపారు.

నిరసనలు విరమించండి: కేంద్రం

వైద్యుల ఆందోళనల నేపథ్యంలో కేంద్ర వైద్య శాఖ స్పందించింది. శనివారం ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు కేంద్ర వైద్య శాఖ అధికారులతో సమావేశమయ్యారు. కేంద్రం ముందు వైద్యుల సంఘాలు ఐదు డిమాండ్లను పెట్టాయి. ఈ డిమాండ్లపై ఒక కమిటీని వేసి సంప్రదింపులు జరుపుతామని కేంద్ర వైద్య శాఖ తెలిపింది. నిరసనలు విరమించుకోవాలని కోరింది.

నిరసనల వేళ వైద్యుల బదిలీలు

జూనియర్ డాక్టర్ హత్య ఘటనపై పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్న వేళ 42 మంది వైద్యులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం వివాదంగా మారింది. ఆందోళనను అణిచివేసేందుకే నిరసనల్లో చురుగ్గా పాల్గొంటున్న వైద్యులను బదిలీ చేశారని వైద్య సంఘాలు ఆరోపించాయి.

కేంద్రంలో కీలక పోస్టులు.. ప్రైవేట్ ఉద్యోగులకు ఆహ్వానం!

న్యూఢిల్లీ, ఆగస్టు 17: కేంద్ర ఆర్థిక శాఖ, హోం, వ్యవసాయం, విద్య..ఇలా వివిధ శాఖల్లో పోస్టుల భర్తీకి యూపీఎస్సీ ఉద్యోగ ప్రకటన జారీ చేసింది. ప్రైవేట్ రంగ ఉద్యోగుల నుంచి కూడా వీటికి దరఖాస్తులు స్వీకరించబోతున్నది. సెక్రెటరీ, డిప్యూటీ సెక్రెటరీ, డైరెక్టర్ స్థాయిలోని 45 లేటరల్ ఎంట్రీ పోస్టుల భర్తీకి సంబంధించి యూపీఎస్సీ దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రకటన విడుదల చేసింది. వీటికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు అర్హులు కాదని పేర్కొన్నది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, వర్సిటీలు, పీఎస్‌యూలు, స్వతంత్ర సంస్థలు, ప్రైవేట్ రంగంలో పనిచేస్తున్నవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపింది. 10 జాయింట్ సెక్రెటరీ, 35 డైరెక్టరీ, డిప్యూటీ సెక్రెటరీ స్థాయి పోస్టుల దరఖాస్తుకు చివరి తేదీ సెప్టెంబర్ 17. సంబంధిత రంగంలో కనీసం 10, 15 ఏండ్ల అనుభవం ఉండాలని నోటిఫికేషన్ పేర్కొన్నది. డిప్యూటేషన్, కాంట్రాక్ట్ విధానంలో కనీసం 3 ఏండ్లు, గరిష్ఠంగా 5 ఏండ్లు పని చేయాల్సి ఉంటుందని తెలిపింది.

ప్రపంచ ఆర్థికానికి 'మంకీ' భయం

- అంతకంతకూ పెరుగుతున్న మంకీపాక్స్ కేసులు
- గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీగా డబ్ల్యూహెచ్‌వో ప్రకటన
- కొవిడ్‌నాటి దుస్థితి దాపురించవచ్చంటున్న నిపుణులు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్(నమస్తే తెలంగాణ): కరోనాతో కకావికలమైన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఇప్పటికీ సాధారణ స్థితికి రాలేదు. ఇలాంటి సమయంలో 'మంకీపాక్స్' రూపంలో మరో వైరస్ కలకలం సృష్టిస్తున్నది. 1958లో గుర్తించిన ఈ వైరస్ కొత్తది కానప్పటికీ, మ్యుటేషన్‌తో కొత్త శక్తిని సంతరించుకోవడం భయపెడుతున్నది.

ఎందుకంత భయం?

ఆఫ్రికాలో మాత్రమే కనిపించే మంకీపాక్స్ వైరస్ స్వీడన్, పాకిస్థాన్‌కూ విస్తరించింది. గతంలో నమోదైన మంకీపాక్స్ కేసులు పశ్చిమ ఆఫ్రికా క్లాడ్ వేరియంట్ (క్లాడ్-2) రకానికి చెందినవి. తీవ్రత తక్కువ ఉండేది. ఇప్పుడు నమోదవుతున్న కేసులు క్లాడ్-1 (కాంగోబేసిన్ క్లాడ్) రకానికి చెందినవిగా శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ వైరస్ సోకితే మరణాల రేటు 10% వరకూ ఉండొచ్చు.

ఆర్థిక వ్యవస్థపై ప్రభావం

కరోనా విలయం మునుపు 2020లో గ్లోబల్ జీడీపీ వృద్ధిరేటు 2.5% మేర పెరుగుతుందని ప్రపంచబ్యాంకు 2019లో అంచనా వేసింది. అయితే, కొవిడ్ కేసులు, లాక్‌డౌన్‌తో జీడీపీ వృద్ధిరేటు 3.1 శాతం మేర పడిపోయింది. ఇప్పుడూ ఎంపాక్స్ కేసులతో అదే పరిస్థితి రావొచ్చని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కరోనాకు వ్యాక్సిన్ అందుబాటులోకి రావడానికి సమయం పట్టినట్లే, మంకీపాక్స్ టీకాలకు సమయం పట్టొచ్చని గుర్తు చేస్తున్నారు.

ఆర్థికవేత్తల భయానికి కారణాలు

- ఇతర దేశాలకు వ్యాపిస్తున్న వైరస్
- మ్యుటేషన్‌తో పెరుగుతున్న వ్యాధి తీవ్రత
- వ్యాధిని గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీగా డబ్ల్యూహెచ్‌వో ప్రకటించింది.
- టీకా ఫార్ములా అందుబాటులో ఉన్నప్పటికీ, అనుమతినివ్వని మెజారిటీ దేశాలు

భారత్‌లో ముందస్తు చర్యలు

మంకీపాక్స్ వ్యాధి వ్యాప్తిని కట్టడి చేసి, నిరోధించేందుకు ముందు జాగ్రత్త చర్యలను చేపట్టినట్టు కేంద్రం పేర్కొన్నది. దేశంలో కొత్తగా మంకీపాక్స్ కేసులు నమోదు కాలేదని ఆరోగ్య శాఖ తెలిపింది. ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా నేతృత్వంలో శనివారం ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం జరిగింది.

స్కీ-బేస్ జంపింగ్‌లో గిన్నిస్ రికార్డు

లండన్: బ్రిటీష్ సాహసికుడొకరు స్కీ-బేస్ జంపింగ్‌లో కొత్త రికార్డును నెలకొల్పాడు. 34 ఏండ్ల జాషువా బ్రెగ్‌మెన్ 18,753 అడుగుల ఎత్తు నుంచి ప్యారాచూట్ సహాయంతో దూకి సురక్షితంగా హిమాలయాలపై దిగి గిన్నిస్ రికార్డు సాధించాడు. అంతకుముందు ఫ్రెంచ్ వ్యక్తి 2019లో సాధించిన 14,301 అడుగుల రికార్డును జాషువా అధిగమించాడు. స్కీయింగ్, బేస్ జంపింగ్ క్రీడల సమ్మిళితమే ఈ స్కీ-బేస్ జంపింగ్. రెండు పొడవైన ప్లాస్టిక్ కర్రలను రెండు బూట్లకు బిగించి మంచులో వేగంగా కదలడమే స్కీయింగ్. ఎత్తయిన ప్రదేశాల నుంచి ప్యారాచూట్ సహాయంతో కిందకు దూకడాన్ని బేస్ జంపింగ్‌గా పేర్కొంటారు.

రెండు దశల్లో వేగంగా వృద్ధాప్యం

*వాషింగ్టన్: వృద్ధాప్యం అనేది కాలక్రమంగా జరిగే ప్రక్రియ అని సంప్రదాయ సిద్ధాంతాలు చెప్తున్న మాట. కానీ అది నిజం కాదని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ పరిశోధకులు తేల్చారు. అణువుల కూర్పు పరంగా మనిషి శరీరం 44, 60 ఏండ్ల వయసులో తీవ్ర మార్పులకు లోనవుతుందని గుర్తించారు. దేహంలో అణువులు, సూక్